మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 240
పేజీలు : 3

గురువారం 02.04.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## అమరావతి - చట్టబద్ధత

### బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**టి మీడియా, ఏప్రిల్ 1, ఢిల్లీ బ్యూరో:**ఆంధ్రప్రదేశ్? రాజధాని అమరావతికి చట్టబద్ధత దిశగా తొలి ఘట్టం విజయవంతంగా పూర్తయింది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్రమంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టగా వైఎస్సార్? కాంగ్రెస్ పార్టీ మినహా అన్ని పార్టీల ఎంపీలూ ముక్తకంఠంతో సమ్మతి తెలిపారు. లోక్‌సభ ఆమోదంతో ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది.లోక్‌సభలో దాదాపు 2 గంటల పాటు చర్చ సాగింది. 13 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. వైసీపీ మినహా ఇతర రాజకీయ పార్టీల ఎంపీలందరూ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత బిల్లుకు సానుకూలంగా మాట్లాడారు. బిల్లుకు మద్దతిస్తున్నట్లు బీజేపీ, కాంగ్రెస్, తెలుగుదేశం, జనసేన, సమాజ్‌వాదీ, ఉద్ధవ్ శివసేన, శరద్‌పవార్ ఎన్సీపీ పార్టీల సభ్యులు ప్రకటించారు. బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపిన వైసీపీ ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. సభ్యుల ప్రసంగాల అనంతరం సభాపతి బిల్లు ఆమోదానికి అనుమతి కోరగా అందరూ సమ్మతి తెలియజేశారు. దీంతో అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం లాంఛనమే అయ్యింది. చివర్లో ప్రసంగించిన కేంద్రమంత్రి నిత్యానందరాయ్ అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంపై సంతోషం వ్యక్తంచేశారు.

# కేరళలో మారుతున్న సమీకరణాలు



## 27 నియోజకవర్గాల్లో3,03,359 ఓట్లు గల్లంతు

### -త్రిముఖ పోరులో కీలక పరిణామం



**టి మీడియా, ఏప్రిల్ 1, ఢిల్లీ బ్యూరో :** అసెంబ్లీ పోల్స్ జరుగుతున్న కేరళలో ఓట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. 2021 అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్ర ఓటర్ల జాబితాల్లో 2.74 కోట్ల మంది ఓటర్ల పేర్లు ఉండగా, ఆ సంఖ్య ఇప్పుడు 2.71 కోట్లకు తగ్గిపోయింది. ఈ లెక్కన 3,03,359 మంది ఓటర్ల పేర్లు తగ్గిపోయాయి. అయితే ఓట్ల గల్లంతు అన్ని అసెంబ్లీ స్థానాల్లో ఒకే రేంజులో లేదు. ప్రత్యేకించి 27 నియోజకవర్గాల్లోనే పెద్దసంఖ్యలో ఓటర్ల పేర్లు తగ్గిపోవడం గమనార్హం. ఈ అసెంబ్లీ స్థానాల్లో ఒక్కో దాంట్లో సగటున 10,000 మందికిపైగా ఓటర్ల పేర్లు తగ్గాయి. ఈ పరిణామం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగలదని పలువురు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

**రాజకీయంగా సున్నిత స్థానాల్లో అనూహ్య మార్పు**

తిరువనంతపురం, వట్టియూర్కావు అసెంబ్లీ స్థానాల్లో ఒక్కో దాంట్లో 40వేల మందికిపైగా ఓట్లు తగ్గాయి. 2021 ఎన్నికల్లో అతి స్వల్ప తేడాతోనే ఈ స్థానాల్లో అభ్యర్థుల జయాపజయాలు డిసైడ్ అయ్యాయి. రాజకీయంగా సున్నితమైన ఈ స్థానాల్లో భారీగా ఓట్లు గల్లంతు కావడం కీలకమైన అంశమే. దీని ప్రభావంతో ఎన్నికల ఫలితాల్లో అనూహ్య మార్పులు కనిపించే అవకాశాలు ఉంటాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. వీటితో పాటు కజకూట్టం, ఎర్నాకులం, దేవికులం, త్రిపునితుర, ఆరన్ముళ, త్రిస్సూర్ సహా మరో 6 నియోజకవర్గాల్లోనూ 20వేల నుంచి 30వేల ఓట్లు తగ్గిపోయాయి. ఇడుక్కి, కొట్టాయం, కొచ్చి, పాలక్కాడ్, కొల్లం, కాయంకుళం వంటి 18 నియోజకవర్గాల్లోనూ సగటున 10,000 నుంచి 20,000 మంది ఓటర్ల పేర్లు తగ్గాయి. వీటిలో చాలా వరకు మంత్రులు, సీనియర్ నాయకులు, కీలక రాజకీయ ప్రముఖులు ప్రాతినిధ్యం వహిస్తున్న కీలక స్థానాల్లు.

**త్రిముఖ పోరు - తారుమారు చేయగల పరిణామం**

లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ , యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ , నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ మధ్య త్రిముఖ పోరుతో కేరళ రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఇంతటి పోటీ వాతావరణం నడుమ ఓట్ల సంఖ్యలో వచ్చిన భారీ మార్పులు ఎన్నికల ఫలితాలను తారుమారు చేయగలవు. చారిత్రాత్మకంగానూ కేరళలోని అనేక నియోజకవర్గాల ఫలితాలు కొన్ని వేల ఓట్ల తేడాతోనే నిర్ణయం అయ్యాయి. ఈ నేపథ్యంలో కీలకమైన నియోజకవర్గాలలో వేల సంఖ్యలో ఓట్లు తగ్గిపోవడం అనే అంశం రాజకీయ పక్షాలను ఆందోళనకు గురి చేస్తోంది.

**నగరాలు, పట్టణాల ఓట్లే తగ్గాయా?**

రాష్ట్రంలోని ఓట్ల సంఖ్య ఇంతగా తగ్గిపోవడంపై పలు ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఈసారి ఓటర్ల జాబితాల నుంచి వైదొలగిన ఈ ఓట్లు ఎవరివి? వీరు రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన వలస కార్మికులా? లేదంటే, తమ నమోదును అప్‌డేట్ చేసుకోని పట్టణ ప్రాంత ఓటర్లా? ఓటర్ల జాబితాలలో చేసిన సవరణల వల్ల ఓట్ల సంఖ్య తగ్గిందా? అనే ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి ఉంది. నగరాలు, పట్టణ ప్రాంతాల నుంచి ప్రజలు వలస వెళుతుంటారు. బహుశా ఈ కారణం వల్ల కూడా అక్కడ ఓటర్ల పేర్లు తగ్గిపోయి ఉండొచ్చు. నగర, పట్టణ ఓటర్లు పరిపాలన, అభివృద్ధి, జాతీయ సమస్యలపై ఎక్కువగా ఆసక్తిని చూపుతుంటారు. ఒకవేళ తగ్గిపోయిన ఓటర్లలో ఎక్కువమంది పట్టణవాసులే అయి ఉంటే, పట్టణ ప్రాంతాల్లోని రాజకీయ పార్టీల బలాబలాల్లో తేడాలు

మిగతా 3లో..

# బీజేపీ లూట్ దివస్

### ధరలు పెరుగుతుండడంపై కాంగ్రెస్ ఫైర్

**టి మీడియా, ఏప్రిల్ 1, ఢిల్లీ బ్యూరో :** దేశంలో ఈరోజు నుంచి చాలా నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, ఇది బీజేపీ లూట్ దివస్ అని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. భారత్ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు సర్వ నాశనం చేయబట్టే ఈ దుస్థితి దాపురించిందన్నారు. ఈ సంక్షోభ కాలంలో దేశంలోని సామాన్యులు ఊరట కోసం ఎదురు చూస్తుంటే, బీజేపీ సర్కారు మాత్రం ప్రజలను లూటీ చేయడంపై, దేశాన్ని దోపిడీ చేయడంపై పూర్తి ఫోకస్ పెట్టిందని ఆయన మండిపడ్డారు. ఈమేరకు బుధవారం రోజు ఖర్గే ఒక ట్వీట్ చేశారు.



**పెరిగిన టీ, తినుబండారాల రేట్లు**

"దేశ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు నాశనం చేసిన పర్యవసానాన్ని ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయులు భరిస్తున్నారు. ఈరోజు నుంచి పలు నిత్యావసరాలు, 900కుపైగా ఔషధాల ధరలు

మిగతా 3లో..

## లోక్‌సభలో అమరావతి

# చట్టబద్ధత బిల్లుపై చర్చ

### విభజన హామీలు అమలు కాలేదన్న తెలంగాణ ఎంపీలు

**టి మీడియా, ఏప్రిల్ 1, ఢిల్లీ బ్యూరో :**



లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సమయంలో తెలుగు రాష్ట్రాల అభివృద్ధి, తెలంగాణకు విభజన హామీల అమలులో జరుగుతున్న అన్యాయాన్ని ఎంపీలు ప్రస్తావించారు. విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభలో గళం వినిపించారు. ఏపీకి నిధులివ్వండి తాము అడ్డుపడబోమని కానీ అదే స్థాయిలో తమ రాష్ట్రానికి ఇవ్వాలంటూ అమరావతి రాజధాని చట్టబద్ధత అంశంపై చర్చలో డిమాండ్ చేశారు. తెలంగాణకు ఇచ్చిన చాలా హామీలు అమలు కాలేదన్న ఎంపీలు అభివృద్ధిలో వెనకబాటుకు గురి చేయట్నద్దంటూ స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.


**రాజధాని లేదని చెప్పుకోవడం దురదృష్టకరం**

రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో పోటీతత్వంతో ముందుకు సాగాలని కోరుకుంటున్నట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. లోక్ సభలో అమరావతికి చట్టబద్ధత బిల్లుపై ప్రసంగించిన ఆయన బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విభజన జరిగి పది సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్?కు రాజధాని లేకపోవడమనేది దురదృష్టకరమని అన్నారు. అమరావతి రాజధానిగా ఎంతో అభివృద్ధి చెందాలని కిషన్ రెడ్డి ఆకాంక్షించారు.కాంగ్రెస్ సభ్యులు తమకు ఎయిర్‌పోర్టు లేదని చెబుతున్నారని, అది ఎవరి పాపమని అడిగారు. ఏపీలో 8 విమానాశ్రయాలు, తెలంగాణలో ఒకే ఒకటి ఉందని గుర్తు చేశారు. పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండి వరంగల్ ఎయిర్‌పోర్టుకు భూములు ఇవ్వలేదని, గతంలో కాంగ్రెస్ కూడా తెలంగాణలోని ఇతర విమానాశ్రయాల విషయంలో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

**తెలంగాణకు అన్యాయం జరుగుతోంది**

విభజన హామీలు నెరవేర్చలేదని కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. బనకచర్లకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తున్నారని, బనకచర్లకు అంగీకరిస్తే తెలంగాణకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు మద్దతిచ్చేందుకే బనకచర్లకు కేంద్రం అంగీకారమని, ఏపీకి దాదాపు 9

మిగతా 3లో..



# సోషల్ మీడియాపై పోలీసుల నిఘా

- పొరపాటున అలా చేస్తే జైలుకే!



**టి మీడియా, ఏప్రిల్ 1, హైదరాబాద్ బ్యూరో :** మాటలతో రెచ్చగొట్టి సోషల్ మీడియా ద్వారా ప్రపంచ యుద్ధ వాతావరణాన్ని అవకాశంగా మార్చుకున్న అసాంఘిక శక్తులు గుట్టుగా గ్రూపులు నిర్వహిస్తున్నాయి. టెలిగ్రామ్, ఇన్‌స్టా వేదికగా విద్యార్థులు, నిరుద్యోగులను టార్గెట్ చేస్తున్నట్లు రాష్ట్ర నిఘా వర్గాలు గుర్తించాయి. హైదరాబాద్‌లో కొందరిని అదుపులోకి తీసుకుని పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇటీవల విజయవాడలో ఉగ్ర లింకుల వ్యవహారం బయటపడటం హైదరాబాద్‌లో మహిళ అరెస్ట్ అవడంతో ఇక్కడి పోలీసులు సైతం ప్రత్యేక నిఘా పెట్టారు.

**అసాంఘిక శక్తులపై నిఘాపెంచిన పోలీసులు**

సామాజిక మాధ్యమాల వేదికగా యువతను రెచ్చగొట్టి తీవ్రవాదంపై ఆకర్షిస్తున్న అసాంఘికశక్తులపై పోలీసులు నిఘా పెంచారు. ప్రస్తుతం ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని అవకాశంగా మలచుకొని యువతను ఉగ్రవాదం వైపు మళ్లించేలా వీడియోలు రూపొందిస్తున్నట్టు నిఘావర్గాలు గుర్తించాయి. హైదరాబాద్‌కు చెందిన కొందరు విద్యార్థులు, నిరుద్యోగులతో టెలిగ్రామ్ యాప్ ద్వారా మంతనాలు సాగిస్తున్నట్లు గుర్తించి అప్రమత్తమయ్యారు. కొందరు యువకుల్ని అదుపులోకి తీసుకొని మందలించినట్టు తెలుస్తోంది. వీరి కదలికలపై నిఘా ఉంచాలని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. ఇటీవల చంచల్‌గూడకు చెందిన మహిళకు ఉగ్రలింకులతో సంబంధాలున్నట్టు విజయవాడ పోలీసులు గుర్తించారు. ఆమె నివాసంలో సోదాలు నిర్వహించి అరెస్ట్ చేయడం సంచలనంగా మారింది. గతేడాది లాలాగూడలోని యువకుడు దేశవ్యాప్తంగా పేలుళ్లకు కుట్రపన్నిన కేసులో విజయనగరం పోలీసులు అరెస్ట్ చేశారు. సాధారణ జీవితం గడిపే వీరిద్దరూ సామాజిక మాధ్యమాల్లో ఏర్పడిన పరిచయాలతో ఉగ్రవాదం వైపు ఆకర్షితులైనట్టు దర్యాప్తులో గుర్తించారు. తాజాగా హైదరాబాద్‌కు చెందిన కొంతమంది యువకులు విదేశీ శక్తుల మాటల వలలో చిక్కినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. విదేశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారనే అనుమానంతో వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించినట్టు విశ్వసనీయ సమాచారం. టెలిగ్రామ్ యాప్‌లోని గ్రూపులో జతకట్టిన అపరిచితుల మాటల ప్రభావంతో తప్పటడుగులు వేశామని మరోసారి తప్పు చేయమంటూ కాళ్లావేళ్లా పడినట్టు తెలిసింది. వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చినట్టు సమాచారం.

**ఎవరు పసిగట్టలేరనే భ్రమలో ఉండొద్దు**

ఇంటా బయటా ఎటుచూసినా యుద్ధవార్తలే. తమ ఇష్టాయిష్టాలకు తగినట్టుగా ఆయా దేశాలకు అనుకూల, ప్రతికూలమైన వీడియోలు రూపొందిస్తున్నారు. వీటిలో ఇష్టమైన వీడియోలు ఒకట్రెండు వీక్షించగానే యాప్ అల్గరిథం ఆధారంగా అదే అంశానికి సంబంధించిన అవే వీడియోలు తెరపై కనిపిస్తుంటాయి. విద్వేషపూరితమైన ప్రసంగాలు, రెచ్చగొట్టే మాటలున్న దృశ్యాలకు ప్రభావితమైన వారంతా టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఒకటవుతున్నారు. అక్కడ తమ ఛాటింగ్, మాటలు, మంతనాలు ఎవరు పసిగట్టలేరనే ధీమాతో అభిప్రాయాలు పంచుకుంటున్నారు. తాము చూసిన వీడియోలను ఆయా గ్రూప్‌ల్లో పోస్ట్ చేస్తున్నారు. వీటిని గుట్టుగా గమనించే విదేశీ శక్తులు ఆ గ్రూప్‌ల్లో సభ్యులుగా చేరుతున్నారు. సభ్యులను రెచ్చగొట్టే విధంగా వీడియో లింక్‌లు పోస్ట్ చేస్తూ తీవ్రవాదం వైపు ఆకర్షితులను చేస్తున్నట్టు పోలీసు వర్గాలు గుర్తించాయి. తమ చేతిలో చిక్కిన వారి బుర్రల్లో విద్వేషాలను నింపి తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఆసక్తి ఉన్నవారిని విదేశాలకు ఆహ్వానిస్తున్నారు. విజయవాడ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు సామాజిక మాధ్యమాలపై నిఘా ఉంచటంతో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. సామాజిక మాధ్యమాలు, యాప్‌ల్లో తాము సాగించే చీకటి కార్యకలాపాలు ఎవరు పసిగట్టలేరనే భ్రమలో ఉండొద్దని.. పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో అసాంఘికశక్తులతో స్నేహం మెలిగే వారి గుట్టు కనిపెడతామని స్పష్టం చేశారు. ఇటువంటి వాటికి ఆకర్షితులై కెరీర్, జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు.

# గ్రామ సభ బహిష్కరణ

- సర్పంచ్ దేశ్ పాండే నర్సింగ్ రావు





**టీ మీడియా ,ఏప్రిల్ 1, టేక్మాల్ ప్రతినిధి:** మెదక్ జిల్లా టెక్మల్ మండల పరిధిలోని దాదాయిపల్లి గ్రామానికి జరుగుతున్న అన్యాయంపై గ్రామస్థులు సమరశంఖం పూరించారు. మండలంలోని ఇతర గ్రామాలకు ఎస్ హెచ్ జి స్వయం సహాయక సంఘం భవనాలు మంజూరైనప్పటికీ, తమ గ్రామానికి మాత్రం ఇప్పటివరకు నిధులు కేటాయించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధుల మంజూరులో తీవ్ర జాప్యం, ఎన్ ఆర్ ఇ జి ఎస్ నిధులు రూ. 5,00,000/- కూడా గత కొంతకాలంగా నిలిచిపోవడంపై గ్రామ సర్పంచ్ దేశ్‌పాండే నరసింహారావు మండిపడ్డారు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా, వినతి పత్రాలు సమర్పించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**నేడు గ్రామ సభ బహిష్కరణ**

గ్రామ హక్కుల కోసం, పెండింగ్‌లో ఉన్న భవనం , నిధుల సాధన కోసం రేపు జరగనున్న గ్రామ సభను సామూహికంగా బహిష్కరించాలని గ్రామ పంచాయతీ సభ్యులు మరియు గ్రామస్తులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేశ్‌పాండే నరసింహారావు మాట్లాడుతూ మా గ్రామ అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు ఎస్ హెచ్ జి భవనం మంజూరు చేసేవరకు రావాల్సిన ఎన్ ఆర్ జి ఎస్ నిధుల విడుదల చేసేవరకు మా పోరాటం ఆగదు. ఈ వివక్షతకు నిరసనగా గ్రామ సభను బహిష్కరిస్తున్నాము ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలిగ్రామ ప్రజలందరూ ఏకమై ఈ నిరసనలో పాల్గొనాలని, హక్కులు సాధించే వరకు పట్టు వదలొద్దని గ్రామ కమిటీ పిలుపునిచ్చింది.

## కన్నులపండుగగా అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు



**టి మీడియా, ఏప్రిల్ 1,పెబ్బేరు :** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఉత్తరా నక్షత్రం సందర్భంగా మణికంఠ స్వామి జన్మదిన వేడుకలు భక్తిశ్రద్ధలమధ్య ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఉదయం అయ్యప్ప స్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం స్వామివారిని పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు ఆలయం ప్రాంగణంలో భక్తులు స్వామియే శరణం అయ్యప్ప అని శరణాలతో మారుమోగింది భజన బృందం సభ్యులు డప్పు మేళ తాళాలతో భక్తి గీతాలను ఆలపించారు మహిళలు పెద్దలు కలిసి భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు భక్తులు చాలా ఓపికతో కూర్చొని భజన కీర్తనలు చేసారు ఈ కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అల్పాహార వితరణ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భజన బృందం సభ్యులు మాలధారణ చేసే భక్తులు అయ్యప్ప స్వామి ఉత్తరనక్షత్రం వేడుకలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రైవేట్ డ్రైవర్స్‌కు కంటి పరీక్షలు



**టీ మీడియా, ఏప్రిల్ 1పెబ్బేరు :** పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక డయాబెటిస్ వ్యాధిగ్రస్తుల కంటి పరీక్షలకు పెబ్బేరు మండలంలోనీ ప్రైవేట్ డ్రైవర్స్ కు స్థానిక పెబ్బేరు పట్టణ సబ్ ఇన్స్ పెక్టర్ ఆఫ్ పోలీస్ యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించారు వారు మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశానుసారంగా ప్రవేట్ డైవర్స్ లో మధు మేహం ఉన్నవారిలో కంటిచూపు దెబ్బతిని ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందనీ ముందుగా గుర్తించి వారికి ప్రత్యేక కంటి ఆపరేషన్ కూడా ప్రభుత్వం ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్ చేయవచ్చని అన్నారు ఇట్టి క్యాంపు మిగతా ప్రైవేట్ డైవర్స్ అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్ సాగర్ చంద్ర శేఖర్ కంటి వైద్యుడు ఖాదర్ హెల్త్ సూపర్ వైజర్ లీలమ్మ పార్వతి స్వరూపరాణి హెల్త్ అసిస్టెంట్ లు రాజశేఖర్ తిరుపతయ్య గౌడ్ కొండయ్య తిరుపతయ్య ల్యాబ్ ట్రైనింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## హోంగార్డ్ ఆత్మహత్య



**టి మీడియా, ఏప్రిల్ 1, నాగర్ కర్నూల్ :** జిల్లాలోని లింగాల మండలం సలేశ్వరం జాతరలో హోంగార్డ్ ఆత్మహత్య కలకలం సృష్టిస్తోంది. కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చెంచుగూడెంకు చెందిన బయన్న(46) కోడేరు పోలీస్ స్టేషన్ లో హోంగార్డు గా విధులు నిర్వహిస్తున్నారు. సలేశ్వరం జాతరలో బందోబస్తులో ఉన్న ఆయన విషం తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన పోలీస్ సిబ్బంది హోంగార్డును అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి భార్య మూడు సంవత్సరాల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. సలేశ్వరం జాతర సందర్భంగా బందోబస్తు డ్యూటీ పడిన పోలీస్ సిబ్బందికి అచ్చంపేటలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బయన్న గైరాజయ్యాడని పోలీసులు తెలిపారు.

## చలువ పందిరి కూలి 15 మందికి తీవ్రగాయాలు



**టి మీడియా, ఏప్రిల్ 1, జగిత్యాల:** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

## బ్యాంక్ చైర్మన్ చాంబర్‌లో మందు పార్టీ..

- పీఏసీఎస్ సిబ్బంది నిర్వాకం



**టి మీడియా, ఏప్రిల్ 1, మోత్కూర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ పీఏసీఎస్ సహకార సంఘం బ్యాంకులో ఉద్యోగుల నిర్వాకం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అర్ధరాత్రి సమయంలో ప్రైవేటు వ్యాపారులు, దళారులతో కలిసి బ్యాంకు సిబ్బంది పార్టీ చేసుకున్నారు బ్యాంక్ చైర్మన్ చాంబర్‌లోనే కూర్చొని మద్యం తాగారు. బ్యాంకులోనే ప్రైవేటు వ్యాపారులతో కలిసి సిబ్బంది మందు తాగడానికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో బ్యాంకు ఉద్యోగుల తీరుపై స్థానికులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళారుల నుంచి లంచం తీసుకుని అర్ధరాత్రి వేళలో లోన్లు మంజూరు చేస్తున్నారని.. సదరు బ్యాంకు ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# వ్యవసాయ వర్సిటీలో ప్లేస్‌మెంట్స్

- కార్పొరేట్ తరహా వేతనాలతో ఉద్యోగాలు




**టి మీడియా, ఏప్రిల్ 1, హైదరాబాద్ బ్యూరో :** విద్యార్థుల లోకం ఒకప్పుడు ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సుల చుట్టూనే తిరిగేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. మారుతున్న కాలంతో పాటు దేశంలో అతిపెద్ద రంగమైన 'వ్యవసాయం' ఇప్పుడు కెరీర్ అవకాశాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. డిగ్రీ పట్టా చేతికి రాకముందే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు దీటుగా భారీ ప్యాకేజీలతో అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్లు కెరీర్‌లో దూసుకుపోతున్నారు. తాజాగా రాజేంద్రనగర్?లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఇందుకు నిదర్శనం. మారుతున్న కాలంతో పాటే విద్యార్థుల ఆలోచనా ధోరణి కూడా మారుతోంది. సాంప్రదాయ వృత్తి విద్యా కోర్సులైన ఇంజినీరింగ్, మెడిసిన్ మాత్రమే కాకుండా వ్యవసాయ ఆధారిత కోర్సుల్లో స్థిరపడేందుకు ఆసక్తి చూపుతోంది యువత. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలు అందిస్తున్న నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. కేవలం వ్యవసాయ విధానాలే కాకుండా సాంకేతికత, నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకుంటున్న పట్టభద్రులు అటు ఉద్యోగాల్లోనూ, ఇటు పారిశ్రామికవేత్తలుగానూ రాణిస్తున్నారు. కార్పొరేట్? లాంటి ఉద్యోగాలు : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇందుకు కీలక అడుగు వేసింది. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి తొలిసారిగా మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. సుమారు 50కి పైగా జాతీయ, అంతర్జాతీయ బహుళజాతి కంపెనీలు ఈ మేళాలో పాల్గొన్నాయి. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే డిగ్రీ పట్టా చేతికి రాకముందే, విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో సమానమైన వేతనాలతో కార్పొరేట్ లాంటి ఉద్యోగాలను చేజిక్కించుకుంటున్నారు. ప్రైవేటు రంగానికి దీటుగా ప్రభుత్వ విభాగాల్లోనూ అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్లకు అపార అవకాశాలు లభిస్తున్నాయి. బీఎస్సీ పూర్తి చేసిన వారు అగ్రికల్చర్ ఆఫీసర్?లుగా కెరీర్ ప్రారంభించవచ్చు. అటు నాబార్డ్ వంటి బ్యాంకింగ్ సంస్థల్లో గ్రేడ్ ఆఫీసర్లుగా, యూపీఎస్సీ ద్వారా ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు కూడా ఎంపికయ్యే అవకాశం ఉంది. ఐబీపీఎస్ నిర్వహించే స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల ద్వారా ప్రభుత్వ బ్యాంకుల్లో స్థిరపడవచ్చు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? రాకతో సాఫ్ట్‌వేర్ రంగంలో అనిశ్చితి నెలకొన్న తరుణంలో వ్యవసాయ రంగం విద్యార్థులకు కొండంత భరోసాను ఇస్తోంది. శాస్త్రవేత్తలుగా, ప్రొఫెసర్లుగా సేవలందించవచ్చు : పరిశోధనలపై ఆసక్తి ఉన్న వారికి ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్? రిసెర్చ్ ఒక వరం. పీజీ చేసిన విద్యార్థులకు సీనియర్ రీసెర్చ్ ఫెలోలుగా నెలకు రూ. 31,000 పైగా స్టైపెండ్ లభిస్తుంది. పీహెచ్‌డీ పూర్తి చేస్తే దేశవ్యాప్తంగా ఉన్న 116 జాతీయ సంస్థలు, 731 కృషి విజ్ఞాన కేంద్రాల్లో శాస్త్రవేత్తలుగా, ప్రొఫెసర్లుగా సేవలందించే అవకాశం ఉంటుంది. కేవలం జీతం కోసమే కాకుండా రసాయనాలతో దెబ్బతింటున్న నేలతల్లిని కాపాడటానికి, సేంద్రీయ సేద్యం వైపు రైతులను మళ్లించడానికి తాము సిద్ధమని యువ పట్టభద్రులు చెబుతున్నారు. 3 రోజుల పాటు జరిగిన ఈ మెగా మేళాకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 9 వ్యవసాయ అనుబంధ కళాశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. రాజేంద్రనగర్, సిరిసిల్ల, జగిత్యాల వంటి ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 100 శాతం నియామకాలు జరపడం విశేషం. ఏటా 1500 మంది పట్టభద్రులు బయటకు వస్తున్న తరుణంలో ఇలాంటి డ్రైవ్‌లు వారి భవిష్యత్తుకు భరోసానిస్తున్నాయని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య హర్షం వ్యక్తం చేశారు.

## ఎల్‌పీజీ కొరతపై ఆటో డ్రైవర్ల ఆందోళన...

- సాగర్ హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం



**టి మీడియా, ఏప్రిల్ 1,హైదరాబాద్:** నగరంలో ఎల్పీజీ ఇంధన కొరతకు నిరసనగాఆటోరిక్షా డ్రైవర్లు బుధవారం ఎల్బీ నగర్ సమీపంలోని సాగర్ హైవేపై ఆందోళన చేపట్టడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పెట్రోల్ బంకుల వద్ద పొడవైన క్యూలలో వేచి ఉన్నప్పటికీ గ్యాస్ లభించకపోవడంతో ఆగ్రహించిన డ్రైవర్లు, ఉదయం నుంచే తమ ఆటోలను రోడ్డుకు అడ్డంగా నిలిపి, వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈ నిరసన రద్దీగా ఉండే ఆ మార్గంలో భారీ ట్రాఫిక్ జామ్‌కు దారితీసి, ప్రయాణికులకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలిగించింది. నిరసన తెలుపుతున్న డ్రైవర్లు, ప్రస్తుతం నెలకొన్న కొరత తమ దైనందిన ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంధన సంక్షోభం కారణంగా పెరుగుతున్న ఆటో ఛార్జీలు ప్రజలపై అదనపు భారాన్ని మోపుతున్నాయని వాపోయారు. తక్షణ జోక్యాన్ని డిమాండ్ చేస్తూ, డ్రైవర్లు ఎల్‌పిజి సరఫరాను క్రమబద్ధీకరించాలని, తమ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్ రద్దీని తగ్గించి సాధారణ పరిస్థితిని పునరుద్ధరించడానికి ప్రయత్నించారు.

## రైతుల జీవితాలతో ఫుట్ బాల్ ఆడుతున్న అధికారులు

- ప్రస్తుత 20 రోజులుగా సాగునీరు లేక ఎండుతున్న పంటలు



**టీ మీడియా, ఏప్రిల్ 1, వనపర్తి బ్యూరో :** రైతులు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు చేతికందే సమయంలో నీళ్లలేక నిండుతుంటే,తన ప్రాణం లెక్కన కాపాడుకుంటూ వచ్చిన పంట పశువుల పాలవుతుంటే గుండెలవిసేలా రైతులు రోదిస్తున్నారని, ఎత్తిపోతల పథకం లిఫ్ట్ లో 16 కోట్లు స్కామ్ చేసిన ఇరిగేషన్ శాఖ అధికారులు ఈ స్కీం లో చిత్రాలు విచిత్రాలు అన్నిన్ని కావు విస్తుకుపోయే నిజాలు అంటూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టిఆర్పి) వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు జి.రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం నెల్విడి ఎత్తిపోతల పథకం లిఫ్ట్ ఆయకట్టులోని నెల్విడి, నర్సింగాపురం, కొన్నూరు,కొన్నూరు పెద్ద తాండ,ద్వారక నగరం వివిధ గ్రామాలు వరి పంట పొలాలు 20రోజులుగా సాగునీళ్లు అందకపోగా కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం కర్షకులకు తీరని కష్టాన్ని,పూడ్చలేని నష్టాన్ని తెచ్చిపెట్టిందని ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా టిఆర్పి జిల్లా యూత్ అధ్యక్షులు జి.రవికుమార్... మాట్లాడుతూ మండలంలోని రామన్ పాడ్ బ్యాక్ వాటర్ రిజర్వాయర్ పై 2006 సంవత్సరంలో గత కాంగ్రెస్ హయాంలో ప్రారంభించారు. నెల్విడి లిఫ్ట్ ట్రయల్ రన్ లోనే 150 లీకేజీలు ఏర్పడ్డాయని ఆరోపించారు. ఎత్తిపోతల పథకంలో నిధులు 11.25 కోట్లు, మరోసారి 4.80 కోట్లు ప్రభుత్వం కేటాయించగా నాసిరకం పైపులు, నాణ్యతలేని తక్కువ హెచ్పీ గల మోటార్లు తో 16 కోట్లు స్కామ్ చేసిన ఇరిగేషన్ శాఖ అధికారుల జేబులోకి వెళ్లాయని,ఇరిగేషనా శాఖ మజాకా 3200 ఎకరాల ఆయకట్టు రైతుల జీవితాలతో ఫుట్ బాల్ 20 20 మ్యాచ్ ఎప్పటికీ ఆడుతుందని ఆరోపణలు చేశారు. ఎత్తిపోతల పథకంలో మొత్తం ఆయకట్టు దాదాపు లిఫ్టు -10 కిలోమీటర్ కాగా భూగర్భ జలాలు మోటార్ బోర్లు కింద కొంతమంది రైతులు సాగు చేసుకుంటు అవి కూడా ఎండిపోవడంతో, ఎత్తిపోతల పథకం ద్వారా కొంత కొద్దిగా నీళ్లు పారేయని, ప్రస్తుతం ఇప్పుడు నీళ్లు రాకపోవడంతో స్టేజీ -2లో 1200 ఎకరాల ఆయకట్టు పూర్తిగా ప్రమాదంలో పడిందని ఆరోపించారు. ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తీసుకొనే వెసలుబాటు ఉన్నప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లడంతో స్టేజీ-1,స్టేజీ-2లోనూ విద్యుత్ అధికారులు కనెక్షన్‌లు తొలగించారని స్థానిక రైతులు చెప్తున్నారు. తక్షణమే సాగునీరు అందించాలని అన్నదాతలు విన్నవించినా సర్కారు పెడచెవిన పెట్టిందని,ఫలితంగా పంటలన్నీ నిలువునా ఎండిపోయాయని పంటలు ఎండిపోవడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని మండిపడ్డారు. దీంతో ఒక్కో ఎకరానికి రూ. 50 వేల నుంచి రూ. 60 వేల వరకూ నష్టపోయామంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. పైగా,తమ శ్రమ కూడా వృథా అయిందంటూ కంటతడి పెడుతున్నారని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి మొత్తం నష్టపోతున్నామని అన్నదాతలు కన్నీరుమున్నీరు అవుతున్నారని,ఎండిపోయిన పంటను పశువులకు మేతగా వేసే దుస్థితి ఏర్పడిందని కోరారు. ఎత్తిపోతల పథకం రెండు స్టేజీలతో ఈ పథకంలో మొత్తం 3200 ఎకరాల ఆయకట్టు మొదటి స్టేజి పంపింగ్ నెల్విడి, రెండో స్టేజి పంపింగ్ నర్సింగాపురం స్టేజీ-2 నుంచి నీటిని ఎత్తిపోయాలంటే ట్రాన్స్‌ఫార్మర్ కావాలని అంటున్నారు. అధికారులు,ప్రజా ప్రతినిధుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించడంలేదని, దీనిపై విద్యుత్, ఇరిగేషన్ శాఖల అధికారులు తమకు సహకరించడం లేదని రైతులు చెబుతున్నారు. 16 కోట్ల స్కామ్ డబ్బులను ఏసీబీ అధికారులు ఆయకట్టు నాణ్యత పై వెంటనే సోదరులు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి లిఫ్టు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని, లేనిపక్షంలో టిఆర్పి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు పోరాటాలు చేస్తామని పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి పార్టీ నాయకులు కరుణాకర్,బొజ్జ మహేష్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.




## పాఠశాల 29వ వార్షికోత్సవ వేడుకలు

- హాజరైన రాష్ట్ర ప్రైవేట్ కళాశాలల సంఘం ఉపాధ్యక్షులు, శ్రీ గాయత్రి ఎడ్యుకేషన్స్ చైర్మెన్ సురగౌని శ్రీనివాస్ గౌడ్

**టీ మీడియా, ఏప్రిల్ 1, వనపర్తి బ్యూరో :** కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల 29వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కళా ప్రదర్శనలు నిర్వహించారు వారి ఆహ్వానం మేరకు పిఆర్టియు కొల్లాపూర్ మండల అధ్యక్షులు డి. శ్రీకాంత్ తో కలిసి కార్యక్రమానికి రాష్ట్ర ప్రైవేట్ కళాశాలల సంఘం ఉపాధ్యక్షులు, శ్రీ గాయత్రి ఎడ్యుకేషన్స్ చైర్మెన్ సురగౌని శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులను చదువుతో పాటు ఇతర అన్ని రంగాల్లో తీర్చిదిద్ది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు పాఠశాల యాజమాన్యం కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది , పట్టణ ప్రముఖులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**టీ మీడియా, ఏప్రిల్ 1, వనపర్తి బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్మని నిరుపేదలకు ఉపయోగపడే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేడు గడపగడపకు సంక్షేమ ఫలాలు అందేలా చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన, సిఎంఆర్ఎఫ్కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేఘన అభయాసం పేరున మృతి చెందిన కుటుంబాలకు 5000 ఆర్థిక సహాయం అందజేస్తుంటే చూడలేని కొందరు దద్దమ్మలు దానిని కూడా రాజకీయం చేయడం సిగ్గుమాలిన తనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ వనపర్తి మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, పట్టణ కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచు, మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగోలుగా వ్యాపారాలు

- జటిలం అవుతున్నట్రాఫిక్ సమస్య

**టీ మీడియా, ఏప్రిల్ 1, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయి. పట్టణంలోని పలు రోడ్లను పెద్ద వ్యాపారులతో పాటు చిరు వ్యాపారాలు కూడా ఆక్రమించేయడంతో ట్రాఫిక్ సమస్య నానాటికీ జటిలం అవుతున్నది. వల్లభ్ నగర్ లో మురికి కాలువల మీద టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసి వ్యాపారం నిర్వహిస్తుండడం, మున్సిపల్ అధికారులు, పోలీసులు పట్టించుకోక పోవడంతో పాదచారులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే టీఫిన్ వ్యాపారాలు, కమాన్, గాంధీ చౌక్ ప్రధాన రోడ్డుపై వాహనాలు నిలిపి వ్యాపారులు అన్‌లోడింగ్ చేయిస్తున్నారు. రహదారులు, ఫుట్‌పాత్‌లు ఇష్టారాజ్యంగా ఆక్రమణతో రోడ్లు కుంచించుకుపోతున్నాయి. పార్కింగ్ స్థలాలు లేక పోవడంతో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపడంతో రద్దీ సమయంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతుంది.గత ప్రభుత్వంలో విస్తరణతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారు. కానీ గతానికి, ప్రస్తుతానికి పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. రోడ్డుకి ఇరువైపులా తోపుడు బండ్లు, వాహనాల నిలుదలతో రోడ్డు ఇరుకుగా మారింది. జిల్లా కేంద్రం కావడంతో వనపర్తికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజల రాకపోకలు పెరుగు తున్నాయి. వ్యాపార సంస్థలు విస్తరిస్తున్నాయి. దీంతో అభివృద్ధితో పాటు ట్రాఫిక్ సమస్యలూ పెరిగి పోతున్నాయి. పలువురు వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆయా దుకాణాల్లో కొనుగోళ్ల నిమిత్తం వచ్చే వారు తమ వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. మరోవైపు టీఫీన్, పకోడి, చాట్ బండ్లు, కూరగాయలు, వస్త్ర వ్యాపారులు రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని కార్యకలపాలు సాగిస్తున్నారు. అర్డివో కార్యక్రమం, కొత్త బస్టాండ్, ప్రజా వైద్యశాల రోడ్డు, కమాన్ చౌరస్తా, గాంధీ చౌరస్తా, థియేటర్,రాజీవ్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా రోడ్డు లో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయి. కూరగాయల బజారు వద్ద రోడ్లపైనే కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మెయిన్ రోడ్డు మొత్తం ట్రాఫిక్ వలయంగా మారిపోతున్నది. దీనికితోడు కొంతమంది వ్యాపారులు వేళాపాళా లేకుండా భారీ వాహనాలను రోడ్లపై నిలిపేసి సరకు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తూ ట్రాఫిక్ సమస్యను మరింత జటిలం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన మున్సిపల్ , పోలీసు అధికారులు అంతగా స్పందించడంలేదు. ముఖ్యంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిని అడ్డుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే విధంగా బహుళ అంతస్థుల వాణిజ్య సముదాయాల్లో సెల్లార్లను వాహనాల పార్కింగ్‌కు కేటాయించాలి. కానీ అత్యధిక వ్యాపార సంస్థలు తమ భవనం సెల్లార్‌ను కూడా వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో ఆయా దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తున్నది. ఎస్పీ నుంచి ఎస్‌ఐ వరకు నిత్యం పట్టణంలో రాకపోకలు సాగిస్తుంటారని, కానీ ట్రాఫిక్ సమస్య, రహదారుల ఆక్రమణల గురించి పట్టించుకోకపోవడం శోచనీయమని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య సముదాయాల్లోని సెల్లార్లలో వాహనాలను పార్కింగ్ చేయించాలని, రహదారులు వెడల్పుగా వున్నచోట వాహనాల నిలుపుదలకు స్థలాలు కేటాయించాలని సూచిస్తున్నారు.

# యాక్ట్ ప్రకారం ధరలను ప్రదర్శించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**టీ మీడియా, ఏప్రిల్ 1, వనపర్తి బ్యూరో :**





వనపర్తి బ్యూరో ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్ లు, స్కానింగ్ కేంద్రాలు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ -2010 ప్రకారం రేట్ చార్టులను ప్రదర్శించడంతో పాటు, నిబంధనలకు అనుగుణంగా నడుచు కోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.బుధవారం మధ్యాహ్నం ఐ.డి. ఓ.సి కాన్ఫరెన్స్ హాల్లో ప్రయివేట్ హాస్పిటల్ రిజిస్ట్రేషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించి, పలు దరఖాస్తులను సమీక్షించారు.మూడు ఆసుపత్రులు, 3 క్లినిక్ లు, 1 డయాగ్నొస్టిక్ సెంటర్, 4 స్కానింగ్ కేంద్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ పరిశీలన చేసింది. కొత్తగా ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న కిరణ్ గ్యాస్ ట్రోల్ లివర్ ఎండోస్కోపీ సెంటర్ క్లినిక్, డాక్టర్ మనిషా రెడ్డి పాలి క్లినిక్, గాయత్రి డెంటల్ క్లినిక్ లకు ఆమోదం తెలిపింది. అదేవిధంగా కొత్త హాస్పిటల్ కోసం దరఖాస్తు చేసుకున్న రవీంద్రబాబు హాస్పిటల్, హైందవ్ న్యూరో హాస్పిటల్, ఆర్య హాస్పిటల్ కి కమిటీ ఆమోదం తెలిపింది. వీటితోపాటు ఒక డయాగ్నస్టిక్ సెంటర్, నాలుగు(2కొత్తవి o2 రెన్యువల్) స్కానింగ్ కేంద్రాలకు కూడా కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రులు నిబంధనలకు తు.చ. తప్పకుండ పాటించాలని, సకాలంలో రెన్యువల్ కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఆస్పత్రులు పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రులు, క్లినిక్ లలో రేట్ ఛార్ట్స్ తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా స్కానింగ్ కేంద్రాలలో ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా జాగ్రత్త పడాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తప్పవని తెలిపారు. అటువంటి సంఘటనలు ఏవైనా జిల్లాలో ఉంటే దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాయినాథ్ రెడ్డి, డి ఎస్పీ బాలాజీ నాయక్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ శ్రీనివాసులు, డాక్టర్ బాబు, ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, ఇతర డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయి నుండి జ్ఞానం

**టీ మీడియా ,ఏప్రిల్ 1, ఆత్మకూరు:**



సమగ్ర విద్యా విజ్ఞాన ప్రదర్శన యందు ప్రత్యేక ఆకర్షణగా నిలిచినది . ప్లే స్కూల్ వారి ఓపెన్ హౌస్ ,ప్రైమరీ తరగతులు భాషకు సమప్రాధాన్యం కల్పించిన విధానం తల్లిదండ్రులకు చాలా సంతోషాన్నిచ్చింది.అలాగే హైస్కూల్ విద్యార్థులకలయికలోభౌగోళిక శాస్త్రం ,భౌతిక శాస్త్రం అయస్కాంతీకరణ ,ఆర్టిఫిసియల్ ఇంటిలిజన్స్ వారి రోబోట్‌లు చాలా అద్భుతమైన ఆవిష్కరణలు .స్పేస్ అటల్ టింకరింగ్ ల్యాబ్ వారి ఆధ్వర్యంలో ఆధునిక భోధన సంబంధించిన అంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి .ఆత్మకూరు పుర ప్రజలు పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థులపై నమ్మకం కలిగింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల రాకతో ఈ ప్రదర్శనలకు మరింత వైభవం ఆనంద సంబరం కలిగింది.ప్రముఖులు విద్యావేత్తలు పిల్లల ప్రదర్శనలు చూసి అభినందించారు .వారి సంబరాలను చూసిన పాఠశాల యాజమాన్యం డాక్టర్ మొగిలి శ్రీధర్ గౌడ్ ప్రిన్సిపల్ ఆన్సీ శ్రీధర్ ,హర్షం వ్యక్తం చేశారు.

## రైతులను ఆదుకోవాలి

**టీ మీడియా, ఏప్రిల్ 1, వనపర్తి బ్యూరో :**



మదనాపూరం మండలం నిల్విడి నర్సింగాపురం ఎత్తిపోతల రిజర్వాయర్ సాగు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డిని బీసీ పొలిటికల్ జేఏసీ మదనాపురం మండల అధ్యక్షులు బి మహేందర్ నాయుడు కోరారు. మహేందర్ నాయుడు మాట్లాడుతూ నెలివిడి నర్సింగాపురం రిజర్వాయర్ కింద దాదాపు 1200 ఎకరాలు సాగు చేయడం జరిగింది.మరి అందులో 400 ఎకరాలు సాగునీరు అందక ఎండిపోయినవి గ్రామాలు కొన్నూరు నెలివిడి ద్వారక నగర్ నర్సింగాపురం పెద్ద తాండ గ్రామాలకు సాగునీరు అందుతుంది. మరి అధికారులు తప్పిదం వల్ల ట్రాన్స్ఫరాలు పనిచేయకపోవడం ట్రాన్స్ఫరాలు వెంటనే రిపేరు చేయించి మిగిలిన ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షులు గూడూష రవికుమార్, నాగిరెడ్డి,చంద్రయ్య, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా జనగణన

- జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

**టీ మీడియా ఏప్రిల్ 01, టేక్మాల్ ప్రతినిధి:**



జనగణన మొదటి విడతలో భాగంగా చేపట్టే ఇండ్ల గణన ప్రక్రియకు సంబంధించి బ్లాకుల రూపకల్పనను అత్యంత పటిష్టంగా, పకడ్బందీగా చేపట్టాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె టేక్మాల్ మండల కేంద్రంలో ఇండ్ల గణన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మే 11 నుండి జూన్ 09 వరకు నిర్వహించనున్న ఇండ్ల గణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావుండకూడదని స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ముఖ్యమైన ఆదేశాలుయూనిట్ విభజన ప్రతి రెవెన్యూ గ్రామాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాలి.బ్లాక్ పరిమితి ఒక్కో బ్లాక్‌లో గరిష్టంగా 300 ఇండ్లు లేదా 800 మంది జనాభా ఉండేలా జాగ్రత్త వహించాలి.డిజిటలైజేషన్: ఈ గణన బ్లాకులను సీఎంఎంఎస్ పోర్టల్ ద్వారానే రూపొందించాలని, సాంకేతిక అంశాల్లో ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.పోర్టల్ నిర్వహణపై తగు సూచనలు ఇస్తూ, తహసిల్దార్లు వ్యక్తిగత శ్రద్ధ వహించి ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్, ఎంపీడీవోలు మరియు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## పదవీ విరమణలలో పాల్గొన్న మాజీ మంత్రి

**టీ మీడియా, ఏప్రిల్ 1, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పట్టణం 25,వ, వార్డుకు చెందిన పశు వైద్య ఒ పశు సంవర్ధక శాఖ అధికారి, వనపర్తి జిల్లా డా. కె. వెంకటేశ్వర్ రెడ్డి విజయవంతంగా తన సేవలను పూర్తి చేసి పదవీ విరమణ పొందిన సందర్భంగా వారి నివాసానికి వెళ్లి దంపతులను శాలువాతో సన్మానించి, వారి సేవలను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలియ జేసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి,అలాగే వనపర్తి పట్టణం 29వ వార్డుకు చెందిన ఎంపీటీవో రవీంద్రబాబు పదవీ విరమణ చేసిన సందర్భంగా వారి దంపతులను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఘనంగా సన్మానించి, భవిష్యత్తులో ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.వనపర్తి పట్టణం 28వ వార్డుకు చెందిన వెంకటరమణ పదవీ విరమణ పొందిన సందర్భంగా వారి దంపతులకు శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. 29వ వార్డుకు చెందిన రణదీవ్ (రిటైర్డ్ టీచర్) పదవీ విరమణ చేసిన సందర్భంగా వారి దంపతులకు ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలో నిబద్ధతతో పనిచేసి ప్రజలకు విశేష సేవలు అందించిన అధికారులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు.మాజీ మంత్రి వెంట గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్,ప్రేమ్ నాథ్ రెడ్డి,నాగన్న యాదవ్ కౌన్సిలర్ మురళి సాగర్,విష్ణు సాగర్, నరసింహ, జోహేబ్ హుస్సేన్, ఆరిఫ్, వంశి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేసి వారి రుణం తీర్చుకునాలి

- ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**టీ మీడియా ఏప్రిల్1, దేవరకద్ర:**



మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మున్సిపల్ కార్యాలయం లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో స్థానిక మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో కలసి పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్, ట్రాఫిక్, పారిశుద్ధ్య నిర్వహణ పనులు, సీసీ రోడ్లు, త్రాగునీరు, విద్యుత్, మౌలిక వసతులు తదితర అంశాలపై చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల తరువాత ఈ మొదటి జనరల్ బాడీ మీటింగ్ లో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో నూతనంగా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు. ప్రజల ఆశీర్వాదం, దీవెనలతో గెలిచినా మీరు మంచి పనులు, ప్రజలకు సేవ చెస్తే.. మీ పేరు చిరస్థాయిలో నిలిచిపోతుంది. నిబద్ధత, క్రమశిక్షణ తో పని చేయాలి. భవిష్యత్తు తరానికి ఆదర్శంగా నిలువాలి. ఎన్నికల సమయంలో మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రజల ఇబ్బందులు తీర్చడానికి నిరంతరం కృషి చేయండి, నా వంతు పూర్తి సహకారం అందజేస్తా, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి.భూత్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి ఇటీవలే 15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకున్నాం..వేసవిని దృష్టిలో ఉంచుకుని, నీటి సమస్యలు తలెత్తకుండా, అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. నీటి సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది, దాని కోసం ఎన్ని నిధులైన ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భూత్పూర్ మున్సిపాలిటీని మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం.

# మంచి నీళ్ల రాక ఇబ్బందులు

- పంచాయతీ అ నిర్లక్ష్యంపై ఆగ్రహం

**టీ మీడియా ,ఏప్రిల్ 1, టేక్మాల్ ప్రతినిధి:**



టేక్మాల్ మండల పరిధిలోని టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన గొల్లగూడెంలో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తూ మిషన్ భగీరథ నీటి సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు మంచి నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మరమ్మత్తులకు గురైన సింగిల్ ఫేస్ మోటార్.. పట్టించుకోని పంచాయతీ యంత్రాంగంగ్రామంలోని 13, 14వ వార్డులో ఉన్న సింగిల్ ఫేజ్ మోటార్ మరమ్మత్తుకు గురై రెండు రోజులు గడుస్తున్నా, గ్రామపంచాయతీ అధికారులు కనీసం అటువైపు చూడకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న తరుణంలో నీటి అవసరాలు పెరగడం, మరోవైపు ఉన్న నీటి వనరులు మూతపడటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్రాగునీటి సరఫరా ఎప్పుడొస్తుందో ఎప్పుడు వస్తాయో తెలువక గ్రామస్థులు వ్యవసాయ బోరు బావుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. రోజువారీ కూలీ పనులకు వెళ్లి



జీవనం సాగించే తాము, పనులు మానుకుని నీటి కోసమే గంటల తరబడి సమయాన్ని వెచ్చించాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప, శాశ్వత పరిష్కారం చూపడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చెడిపోయిన సింగిల్ ఫేజ్ మోటార్లకు మరమ్మత్తులు పూర్తి చేసి నీటిని సరఫరా చేయాలి. నిలిచిపోయిన మిషన్ భగీరథ నీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి దాహార్తిని తీర్చాలని, లేనిపక్షంలో పంచాయతీ ముందు ఆందోళన చేపడతామని గ్రామ ప్రజలు హెచ్చరించారు.

# కేరళలో మారుతున్న సమీకరణాలు

వస్తాయి. వాటి మధ్య పోటీ మరింత పెరుగుతుంది. ఈ అంశం నగరాలు, పట్టణాల్లో విస్తరించి ఉన్న అసెంబ్లీ స్థానాల ఫలితాలను నిర్దేశిస్తుంది.

### ఆ ఓటర్లు తగ్గిపోయినా ఓటింగ్ సరళిలో మార్పు

ఓటర్ల సంఖ్య తగ్గిపోవడం అనేది కొన్ని పార్టీలకు ప్రతికూలిస్తుంది. ఇంకొన్ని పార్టీలకు అనుకూలిస్తుంది. బలమైన క్షేత్రస్థాయి యంత్రాంగం, మెరుగైన బూత్ స్థాయి సమీకరణ కలిగిన పార్టీలకు ఈ అంశం కలిసొచ్చే ఛాన్స్ ఉంటుంది. నేమోం, కజకూట్టం, పాలక్కాడ్ వంటి అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ తన ఉనికిని బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఆయా చోట్ల బీజేపీకి అనుకూలంగా ఉండే నిర్దిష్ట వర్గాల ఓటర్ల సంఖ్య తగ్గిపోయి ఉంటే, అక్కడి ఫలితాలు మారిపోయే ఛాన్స్ ఉంటుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. సీపీఎం సారథ్యంలోని ఎల్‌డీఎఫ్ కూటమికి, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమికి ఆరన్ముళ, దేవికుళం, కొట్టాయం వంటి స్థానాలు కంచుకోటలుగా ఉన్నాయి. ఆయా చోట్ల ఓట్లు తగ్గిపోవడంతో అక్కడ ఓటింగ్ సరళిలో మార్పు రావచ్చు. ఎన్నికల ప్రచారంలో ఎక్కువగా గ్రౌండ్ వర్క్ చేసే పార్టీలనే విజయం వరించొచ్చు.

### ఎల్‌డీఎఫ్ కూటమిపైనే ఎక్కువ ఎఫెక్ట్?

మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే, ఓట్ల సంఖ్యలో భారీ తగ్గుదల కనిపిస్తున్న 27 అసెంబ్లీ స్థానాల్లో 19 ప్రస్తుతం వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి చేతిలో ఉన్నాయి. మిగతా 8 స్థానాలు యూడీఎఫ్ కూటమి ఆధీనంలో ఉన్నాయి. దీనివల్ల ఓటర్ల పేర్ల సంఖ్య తగ్గడం అనే పరిణామం ప్రభావం ఎక్కువగా అధికార ఎల్‌డీఎఫ్ కూటమిపైనే కనిపించే అవకాశాలు ఉంటాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఆ 19 స్థానాల్లో ఎల్‌డీఎఫ్ ఓటుబ్యాంకు తగ్గిపోయి ఉంటే, చివరకు సీట్ల నష్టానికి దారితీయొచ్చని వారు హెచ్చరిస్తున్నారు.

### బీజేపీకి నష్టాలు, కొత్త అవకాశాలు

కేరళ ఎన్నికల్లో ప్రతిసారి ఓటింగ్ శాతం అధికంగా నమోదు అవుతుంటుంది. అక్కడి ప్రజలు రాజకీయంగా క్రియాశీలకంగా ఉంటారు. ఈసారి ఓటర్ల పేర్ల సంఖ్యలో తగ్గుదల అనేది ఒక సాంకేతిక సవరణ కావచ్చు, లేదంటే మారుతున్న ఓటర్ల ప్రవర్తనకు సూచిక కావచ్చు. ఒకవేళ రెండోది నిజమైతే, పోలింగ్ రోజున ఓటింగ్ శాతం ప్రభావితమై ఎన్నికల ఫలితాల అంచనాలు తారుమారు అవుతాయని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. పెరుగుతున్న ఓటింగ్ శాతాన్ని విజయ అవకాశంగా మార్చుకోవాలని ప్రయత్నిస్తున్న బీజేపీకి (ఎన్‌డీఏ కూటమి) ఈ పరిస్థితి నష్టాలు, అవకాశాలు రెండింటినీ కల్పించనుంది. ఓటర్ల పేర్ల సంఖ్య తగ్గడం అనేది ఆ పార్టీ పోటీచేసే స్థానాల్లో జనం మద్దతును పెంచుకోవడానికి దోహదం చేస్తుంది. ఒకవేళ ఓటర్ల జాబితాలో బీజేపీకి అనుకూల అభిప్రాయం కలిగిన వర్గాలు లేకుంటే, అలాంటి స్థానాల్లో పార్టీ ఊపు బలహీనపడొచ్చు.

### ఆశించిన ఫలితం కోసం అలా చేయాల్సిందే

మొత్తం మీద ఈ ఎన్నికలు విస్తృత రాజకీయ కథనాల కంటే సూక్ష్మస్థాయి వ్యూహాలపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. ఓటర్ల వర్గాలను గుర్తించడం, ఓటింగ్ శాతాన్ని నిర్ధారించడం, బూత్ స్థాయి కార్యకలాపాలను నిర్వహించడం అనేవి ప్రధాన పాత్రను పోషిస్తాయి. వేలాది మంది ఓటర్లు కనుమరుగైన అసెంబ్లీ స్థానాల్లో ప్రస్తుత పరిస్థితులు, పరిణామాలకు అనుగుణంగా పార్టీలు మారితేనే ఆశించిన ఫలితాన్ని అందుకోగలవు.

# బీజేపీ లూట్ దివస్

పెరగబోతున్నాయి. దీనివల్ల ప్రజల ఆరోగ్య సంరక్షణ వ్యయాలు చుక్కలను అంటుతున్నాయి. గుండె జబ్బులు ఉన్న రోగులకు అమర్చే కరోనరీ స్టంట్ల ధరలూ పెరిగాయి. వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరలు రాకెట్ వేగంతో పెరుగుతున్నాయి. ఈ సిలిండర్ల సప్లై దారుణంగా తగ్గిపోయింది. దీంతో టీ రేటు, రోడ్డుపక్కన అమ్మే తినుబండారాల రేట్లు కూడా పెరిగిపోయాయి. ప్రత్యేకించి ప్రభుత్వ స్కూళ్లలో అమలుచేసే మధ్యాహ్న భోజన పథకంపైనా ప్రతికూల ప్రభావం పడుతోంది. విమాన ఇంధనం ధర మరింత ప్రియం అవుతోంది. ఒకప్పుడు సామాన్య పౌరులూ విమానాల్లో ప్రయాణించేవారు. ఇప్పుడు విమాన ప్రయాణం అనేది ఖరీదైన విషయంగా మారిపోయింది. సాక్షాత్తూ ప్రభుత్వమే విమాన టికెట్ల ధరలపై పరిమితిని ఎత్తేసింది. బిట్యుమెన్ ధరలూ 50 శాతం పెరిగాయి. ప్రజలు ఇప్పుడు మరింత ఎక్కువ టోల్ ట్యాక్స్‌ను చెల్లించాల్సి వస్తోంది. ఇది హైవేలపై దారుణమైన దోపిడీలా మారిపోయింది. స్పీడ్ పోస్ట్ ఛార్జీ సైతం 34 శాతం పెరిగింది. ప్లాస్టిక్ వస్తువులు, స్టీల్, సిరామిక్స్, రైతులు వినియోగించే పీవీసీ పైపుల ధరలూ పెరిగాయి. దేశ నిర్మాణ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది” అని ట్వీట్‌లో ఖర్గే ప్రస్తావించారు.

### లోక్‌సభ సీట్ల పెంపుతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం : కాంగ్రెస్

లోక్‌సభ సీట్ల సంఖ్యను 50 శాతం పెంచే బిల్లును బలవంతంగా ఆమోదింపజేయాలని మోదీ సర్కారు భావిస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. దీనివల్ల దక్షిణ, ఈశాన్య, పశ్చిమ భారత్‌లలోని చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని ఆయన తెలిపారు. ఒకవేళ ఆ ప్రతిపాదిత బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభిస్తే, ప్రతీ రాష్ట్రంలోనూ లోక్‌సభ సీట్లు 50 శాతం మేర పెరుగుతాయన్నారు. దీనిపై ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారని, ఆ బిల్లుపై అధికారిక ప్రకటన వెలువడ్డాక మరిన్ని రాష్ట్రాలూ వ్యతిరేకించే అవకాశం ఉంటుందని జైరాం రమేశ్ చెప్పారు. అన్ని రాష్ట్రాల్లో సరిసమానంగా 50 శాతం చొప్పున లోక్‌సభ సీట్లను పెంచితే, దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్నారు. ఈవిషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్యనున్న గ్యాప్ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.

### రాష్ట్ర అసెంబ్లీల సీట్లనూ 50 శాతం పెంచే ప్లాన్

ఉదాహరణకు ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 80 లోక్‌సభ సీట్లు, తమిళనాడులో 39 సీట్లు ఉన్నాయి. కానీ ప్రతిపాదిత బిల్లు ప్రకారం యూపీలో సీట్ల సంఖ్య 120కి పెరుగుతుంది. ఇక ఇదే సమయంలో తమిళనాడులోని సీట్లు 59కే పరిమితం అవుతాయి. కేరళలో 20 నుంచి 30కి, బిహార్‌లో 40 నుంచి 60కి సీట్లు పెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాల్లోని సీట్ల సంఖ్య 66కు, ఉత్తరాది రాష్ట్రాల్లోని సీట్ల సంఖ్య 200కు చేరుతుంది. దీనివల్ల తాత్కాలికంగా లోక్‌సభ సీట్ల నిష్పత్తి మారకపోవచ్చు. కానీ దీర్ఘకాలంలో చాలా ప్రతికూల పరిణామాలు కనిపిస్తాయి. ఇలాంటి బిల్లును మోదీ సర్కారు ఏకపక్షంగా తయారు చేయడం సరికాదు. చివరకు రాష్ట్ర అసెంబ్లీల సీట్లనూ 50 శాతం పెంచాలని కేంద్రం భావిస్తోంది. దీనిపైనా కూలంకశమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది” అని జైరాం రమేశ్ తెలిపారు.



## లోక్‌సభలో అమరావతి

# చట్టబద్ధత బిల్లుపై చర్చ

విమానాశ్రయాలు ఉన్నాయని, విమానాశ్రయాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని స్పష్టం చేశారు. రూ.వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు ఏపీకి ఇస్తున్నారని, తెలంగాణకు రైల్వే ప్రాజెక్టులు ఇవ్వట్లేదుని విమర్శించారు. నిధుల కేటాయింపు విషయంలో తెలంగాణపై తీవ్ర వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. పోలవరం వెనక జలాల వల్ల తెలంగాణలో 2 లక్షల మందికి ముప్పు ఉందని, కొత్తగూడెం, భద్రాచలం ప్రాంతంలోని ప్రజలకు ముప్పు ఉందని తెలిపారు. పోలవరం ముంపు నుంచి కాపాడేందుకు కరకట్టలు కట్టాలని, తెలంగాణకు బయ్యారం స్టీల్ ప్లాంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీలను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ : ఏపీకి అదనపు నిధులు ఇవ్వడంపై తమకు అభ్యంతరం లేదన్న ఎంపీ రఘురాం రెడ్డి ఏపీ తరహాలోనే తెలంగాణకు అదనపు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు కేంద్రం సహకరించాలని, మూసీ ప్రాజెక్టుకు కేంద్రం సహకరించాలని, రీజినల్ రింగ్ రోడ్డు, కేటీపీఎస్ విస్తరణకు కేంద్రం సహకరించాలని తెలిపారు. ఏపీలో కలిపిన వాటిలో 4 గ్రామ పంచాయతీలను వెనక్కి ఇవ్వాలని, ఆ 4 గ్రామ పంచాయతీలు ఏపీ, తెలంగాణలో ఎక్కడా ఉనికిలో లేవని, భద్రాచలం నియోజకవర్గంలోని 4 గ్రామ పంచాయతీలను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూన్ 2వ తేదీని బ్లాక్‌డే పరిగణించవద్దని ఏపీకి విజ్ఞప్తి చేశారు. జూన్ 2వ తేదీని రెండు రాష్ట్రాల అభివృద్ధి దినంగా పరిగణించాలని కోరారు.